ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పోర్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 45 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 + https:www.prajarepublic.com + వెల - 1/- గురువారం 19 సెప్టెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# కశ్మీర్ యువత చేతుల్లో ఇక రాళ్లు ఉండవు: మోదీ

**జమ్మూకశ్మీర్ యువత రాళ్లను పడేసి పుస్తకాలు, పెన్నులు పట్టుకుంటున్నారని మోదీ అన్నారు. తొలి దశలో వారు ఎలాంటి భయం లేకుండా ఓటుహక్కు వినియోగించుకున్నారన్నారు.**



శ్రీనగర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం జమ్మూకశ్మీర్లో పర్యటించారు. శ్రీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని.. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మూడు పార్టీలు తమ సొంత ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. వారి స్వార్థం కారణంగా కాశ్మీరీ ప్రజలకు పెను నష్టం వాటిల్లిందన్నారు. "1980ల్లో ఏం జరిగిందో మర్చిపోయారా? ఆ మూడు పార్టీలు (కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ) జమ్మూకశ్మీర్ను వారి సొంత సామ్రాజ్యంగా భావించాయి. ఆ మూడు కుటుంబాల (గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం) వారు కాకుండా ఇంకెవర్నీ రాజకీయాల్లోకి రానిచ్చేవారు కాదు. విద్యకు దూరమైన మన యువత చేతిలో వారు రాళ్లు పెట్టారు. వారి స్వప్రయోజనాల కోసం మన పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ పై కుట్రలు చేసే ప్రతి శక్తినీ ఓడించి తీరుతాం" అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన తొలి విడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదవ్వడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. "ఇప్పుడు జమ్మూకశ్మీర్ యువత నిస్సహాయులు కాదు. ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇప్పుడు కశ్మీర్ యువత రాళ్లను వదిలి పుస్తకాలు, పెన్నులు పట్టుకుంటున్నారు. వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అంతేకాదు. ఇక్కడి ప్రజలు ఎలాంటి భయం, బెరుకు లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. రెండో విడతలోనూ మరింత ఎక్కువ మంది ఈ ప్రజాస్వామ్య పండుగలో పాల్గొని సరికొత్త రికార్డులు సృష్టించాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

# ఏపీలో వరదలు.. అదానీ గ్రూప్ సాయం రూ.25 కోట్లు

**కుండపోత వర్షాలు, వరదలతో విలవిల్లాడిన ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేసేందుకు అదానీ గ్రూప్ ముందుకొచ్చింది.**

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: కుండపోత వర్షాలు, వరదలతో విలవిల్లాడిన ఆంధ్రప్రదేశుకు సాయం చేసేందుకు అదానీ గ్రూప్ ముందుకొచ్చింది. అదానీ ఫౌండేషన్ రూ.25 కోట్లు సాయం ప్రకటించింది. ఈ మేరకు గౌతమ్ అదానీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అపార నష్టం చవిచూసిన ఆంధ్రప్రదేశ్ను ఆదుకునేందుకు తమవంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు సంబంధిత పత్రాలను అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ అందజేస్తున్న ఫొటోను షేర్ చేశారు.




# చిత్తూరులో డయాలసిస్ యూనిట్.. హామీ నెరవేరుస్తున్నా: లోకేశ్

**చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో రూ.3 కోట్లతో డయాలసిస్ యూనిట్ను ప్రారంభించబోతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.**

బంగారుపాళ్యం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో రూ.3 కోట్లతో డయాలసిస్ యూనిట్ను ప్రారంభించబోతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. యువగళం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ఈ యూనిట్ ద్వారా రోజుకు 10 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ నిర్వహించే అవకాశముందన్నారు. అవసరాన్ని బట్టి భవిష్యత్లో యూనిట్ సామర్థ్యాన్ని పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఈ యూనిట్ను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు.



# పాకిస్థాన్, కాంగ్రెస్ ఒక తాను ముక్కలే: అమిత్ షా

**పాకిస్థాన్, కాంగ్రెస్ ఎప్పుడూ ఒకే గొంతుక వినిపిస్తాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ మండిపడ్డారు. అవి ఒక తాను ముక్కలేనని విమర్శలు గుప్పించారు.**



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: ఆర్టికల్ 370 పునరుద్ధరణ విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వానిది కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమిది ఒకే మాటని పాక్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి మరోసారి తేటతెల్లమైందని విమర్శించారు. పాకిస్థాన్, కాంగ్రెస్లు ఎప్పుడూ ఒకే గొంతుక వినిపిస్తాయనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో హస్తం పార్టీ చేతులు కలుపుతుందని ఆరోపించారు. "ఆర్టికల్ 370, 35ఏల పునరుద్ధరణ విషయంలో పాకిస్థాన్ రక్షణ మంత్రి వ్యాఖ్యలతో కాంగ్రెస్, జేకేఎన్సీ వైఖరి మరోసారి బయటపడింది. పాకిస్థాన్, కాంగ్రెస్కు ఒకే విధమైన ఉద్దేశాలు, ఒకే అజెండాలున్నాయని ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసింది. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీస్తూ, భారత వ్యతిరేక శక్తులకు రాహుల్ గాంధీ అండగా నిలుస్తున్నారు. కొన్నేళ్లుగా ఇలాగే వ్యవహరిస్తున్నారు" అని పేర్కొన్నారు. పాకిస్థాన్పై వైమానిక లేదా సర్జికల్ స్ట్రైకక్కు ఆధారాలు చూపించాలని అడగడం, భారత సైన్యంపై ఆయన అభ్యంతరకర విషయాలు మాట్లాడటం చూస్తుంటే పాకిస్థాన్-కాంగ్రెస్ల గొంతుక ఒక్కటేనని అర్థమవుతోందని దుయ్యబట్టారు.

## మీది మీరు చూసుకోండి: ఒమర్

ఆర్టికల్ 370 విషయంలో పాకిస్థాన్ వ్యాఖ్యలు చేయడంపై జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. భారత్లో ఎన్నికలపై జోక్యం చేసుకోవద్దని అన్నారు. అందుకు బదులు.. మీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడంపై శ్రద్ధ చూపాలని పాకిస్థాన్కు హితవు పలికారు. కశ్మీర్ ఆర్టికల్ 370 పునరుద్ధరణ విషయంలో తమ దేశంలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం, భారత్లోని కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి ఒకే వైఖరితో ఉన్నాయని పాక్ రక్షణ మంత్రి చెప్పడం తాజా చర్చకు దారితీసింది. జమ్మూ కశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ పాక్ మంత్రి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుక

# జగన్ పాపాల పుట్టలో పాముల్లా అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు.. : మంత్రి డీబీవీ స్వామి

**తిరుమల లడ్డూల తయారీలో నాణ్యతపై అధికారులు తెలిపిన విషయాలపైనే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. తిరుమలలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: తిరుమల లడ్డూల తయారీలో నాణ్యతపై అధికారులు తెలిపిన విషయాలపైనే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. తిరుమలలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. జగన్ చేసిన పాపాలు పుట్టలో పాముల్లా అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. ఆగస్టు 2023 నుంచి వాలంటీర్లను ఎందుకు రెన్యువల్ చేయలేదని ప్రశ్నించారు. సలహాదారులకు మాత్రం పదవీకాలం ముగియక ముందే జగన్ ఎలా రెన్యువల్ చేశారని నిలదీశారు. గత ఐదేళ్లలో సాక్షి పత్రికకు అడ్డగోలుగా ప్రజాధనం దోచిపెట్టారని మండిపడ్డారు.

## తిరుమలకు నాణ్యత లేని నెయ్యి.. వాస్తవమే: ఓవీ రమణ

వైకాపా హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేని నెయ్యి ఉపయోగించారనేది వాస్తవమని తితిదే మాజీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఈవో ధర్మారెడ్డికి కావాల్సిన వారి కోసం ట్రేడర్లను తీసుకొచ్చారన్నారు. ఢిల్లీలోని ఆల్ఫా సంస్థకు నెయ్యి సరఫరా టెండర్ను అప్పజెప్పారని.. ఆ సంస్థ రకరకాల కెమికల్స్ ద్వారా ఆవు నెయ్యి సరఫరా చేసిందని పేర్కొన్నారు. ఆలయంలో ఉండాల్సిన పరకామణిని బయటకు తీసుకొచ్చిందెవరని ప్రశ్నించారు.

## లడ్డూ నాణ్యతను ఉద్దేశపూర్వకంగా తగ్గించారు: భానుప్రకాశ్ రెడ్డి

తిరుమల లడ్డూ నాణ్యతను వైకాపా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తగ్గించిందని భాజపా నేత భానుప్రకాష్రెడ్డి విమర్శించారు. కమీషన్ల కోసమే వైకాపా ప్రభుత్వం లడ్డూల నాణ్యత తగ్గించిందన్నారు. నిపుణుల కమిటీ నివేదికలో నెయ్యి కల్తీ అంశాలు వెలుగు చూశాయన్నారు. విజిలెన్స్ నివేదిక త్వరలో బయటకు రానుందని తెలిపారు.

# దిల్లీ సీఎంగా.. 21న ఆతిశీ ప్రమాణస్వీకారం

**దిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ నాయకురాలు ఆతిశీ ఈనెల 21న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు పార్టీ అధికారికంగా వెల్లడించింది.**

దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: దేశ రాజధాని దిల్లీలో మరో రెండు రోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిశీ దిల్లీ ముఖ్యమంత్రిగా సెప్టెంబరు 21న ప్రమాణం చేయనున్నారు. ఈమేరకు పార్టీ గురువారం అధికారికంగా వెల్లడించింది. ఆమెతో పాటు పలువురు నేతలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపింది. ఈసారి డిప్యూటీ సీఎంగా ఎవర్నీ నియమించే అవకాశాలు కన్పించట్లేదు. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై వచ్చిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీ పేరును ప్రతిపాదించగా.. ఆప్ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతివ్వాలంటూ ఆతిశీ.. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కోరారు. ఆయన అంగీకరించడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆప్ సిద్ధమైంది. షీలా దీక్షిత్ (కాంగ్రెస్), సుష్మా స్వరాజ్ (భాజపా) తర్వాత ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆతిశీ నిలవనున్నారు. దిల్లీలోని కల్కాజీ నియోజకవర్గానికి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుత దిల్లీ ప్రభుత్వంలో ఆమె 14 శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అందులో ఆర్థిక, రెవెన్యూ, విద్య తదితర ముఖ్య శాఖలున్నాయి.



# నాకు, నా కుటుంబానికి న్యాయం కావాలి: కాదంబరి జెత్వానీ

**ముంబయి నటి కాదంబరీ జెత్వానీ సచివాలయానికి వెళ్లారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితను కలిశారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: ముంబయి నటి కాదంబరీ జెత్వానీ సచివాలయానికి వెళ్లారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితను కలిశారు. కేసు విచారణను వేగవంతం చేయాలని కోరారు. "మా కుటుంబానికి రక్షణ కావాలని కోరుతున్నాం. నాకు, నా కుటుంబానికి న్యాయం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ధన్యవాదాలు. నాపై తప్పుడు కేసు పెట్టారని మంత్రికి వివరించా. నాకు మానసికంగా, భౌతికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. నా ఫోన్లు రెండుసార్లు ఓపెన్ చేయడానికి ప్రయత్నించారు" అని కాదంబరీ జెత్వానీ తెలిపారు.

# రుణమాఫీ కోసం పోరాడుతున్న రైతులను అరెస్టు చేయడం దారుణం: కేటీఆర్

**రుణమాఫీ కోసం పోరాడుతున్న రైతులను అరెస్టు చేయడం దారుణమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: రుణమాఫీ కోసం పోరాడుతున్న రైతులను అరెస్టు చేయడం దారుణమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. చలో ప్రజాభవన్కు పిలుపునిచ్చిన వారి అరెస్టును ఖండిస్తున్నామన్నారు. రైతులు, సంఘాల నేతలను పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణమని చెప్పారు. అక్రమంగా నిర్బంధించిన అన్నదాతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఇచ్చి మోసం చేసినందునే ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు సంఘటిత శక్తి ముందు ప్రభుత్వం తలవంచక తప్పదని కేటీఆర్ తెలిపారు.

# మూడు రోజుల పాటు మంచులో చిక్కుకుపోయిన జవాన్..ఆర్మీ థ్రిల్లింగ్ ఆపరేషన్

**మంచులో చిక్కుకుపోయిన ఒక జవాన్, పోర్టర్ను థ్రిల్లింగ్ ఆపరేషన్లో భాగంగా ఆర్మీ కాపాడుకోగలిగింది.**

దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: భారత్-చైనా సరిహద్దులో ఒక అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. పెట్రోలింగ్ చేస్తోన్న ఓ సైనికుడు మంచులో చిక్కుకున్న మూడురోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డారు. జవాన్లు నిర్వహించిన థ్రిల్లింగ్ ఆపరేషన్ లో అతడిని రక్షించారు. జాతీయ మీడియా కథనం ప్రకారం.. బిహార్లోని బక్సర్కు చెందిన అనిల్ రామ్.. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ బృందంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చైనా సరిహద్దులోని మున్స్యారీ-మిలామ్లో గస్తీ నిర్వహిస్తోన్న సమయంలో మంచు కారణంగా దారిమూసుకుపోయింది. అనిల్తో పాటు పోర్టర్ దేవేంద్రసింగ్ కూడా దానిలో చిక్కుకుపోయారు. ఆ గజగజవణికే చలిలో ఒక గుహలో తలదాచుకున్నారు. ఆ ప్రాంతం మున్స్యారీకి 84 కి.మీ దూరంలో ఉంది. వీరికోసం ఆర్మీ ఒక బృందాన్ని రంగంలోకి దింపింది. ప్రతికూల పరిస్థితులను లెక్కచేయకుండా వారికోసం అన్వేషించింది. చివరకు తప్పిపోయిన మూడోరోజుకు వారు ఆర్మీ బృందం కంటపడ్డారు. గుహ నుంచి వారిని బయటకు తీసుకువచ్చి, ఆసుపత్రిలో చేర్పించారు. అనిల్, దేవేంద్ర ఇద్దరు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. నాలుగు అడుగులమేర పేరుకుపోయిన మంచులో వెళ్లి వారిని రక్షించిన బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆపరేషన్లో అనిల్ను కాపాడిన విషయం తెలుసుకున్న అతడి కుటుంబం ఊపిరిపీల్చుకుంది. త్వరలో అతడు ఇంటికివస్తాడని సోదరుడు గాంధీ కుమార్ వెల్లడించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## ఆపరేషన్ బుడమేరు.. కార్యాచరణపై మంత్రి నిమ్మల సమీక్ష

**విజయవాడ ప్రజలను ముంపు నుంచి రక్షించడమే లక్ష్యంగా బుడమేరు విస్తరణ ఆపరేషన్ చేపట్టనున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: నగర ప్రజలను ముంపు నుంచి రక్షించడమే లక్ష్యంగా బుడమేరు విస్తరణ ఆపరేషన్ చేపట్టనున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆపరేషన్ బుడమేరు యాక్షన్ ప్లాన్ కార్యాచరణపై విజయవాడలోని జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఈఎన్సీతోపాటు నీటి పారుదల టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సర్వే అధికారులు పాల్గొన్నారు. భవిష్యత్లో బుడమేరు నుంచి ఎలాంటి ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని మంత్రి నిమ్మల తెలిపారు.

## వైకాపాలో జగన్, భారతి మాత్రమే మిగులుతారేమో!: సోమిరెడ్డి

**రాజధానికి ఎలాంటి పెట్టుబడులు రాకూడదనే లక్ష్యంతో వైకాపా కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు.**

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: రాజధానికి ఎలాంటి పెట్టుబడులు రాకూడదనే లక్ష్యంతో వైకాపా కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి సముద్ర నీటి మట్టం కంటే 35 మీటర్ల ఎత్తులో ఉందని తెలిపారు. రాజధానిలో యథావిధిగా కార్యకలాపాలుజరుగుతుండటం చూసి వైకాపా నేతలు ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి మూడో కేజీఎఫ్ అని దుయ్యబట్టారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోకుండా సీఎం చంద్రబాబు గురించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కాకాణి అవినీతిపై త్వరలోనే చర్యలు ఉంటాయన్నారు. జగన్ వైఖరితో విసిగిపోయి ఆ పార్టీని పలువురు నేతలు వీడుతున్నారన్నారు. వైకాపా మొత్తం ఖాళీ అయి ఇక ఆ పార్టీలో జగన్, ఆయన భార్య భారతి మాత్రమే మిగిలిపోతారేమోనని వ్యాఖ్యానించారు.



## గోవాలో జానీ మాస్టర్ అరెస్ట్

**కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీబాషాను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ ఎస్ వోటీ పోలీసు బృందం గోవాలోని లాడ్జిలో అతడిని అదుపులోకి తీసుకుంది. అక్కడి కోర్టులో హాజరు పరిచి నగరానికి తీసుకొస్తున్నారు. నేరుగా ఉప్పరపల్లి కోర్టులో జానీ మాస్టరు హాజరుపరిచే అవకాశముంది. తనపై పలుమార్లు అత్యాచారం చేశాడంటూ ఓ మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ (21) ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదైంది. బాధితురాలు రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగికి బదిలీ చేశారు. అతడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి జానీ మాస్టర్ను అరెస్ట్ చేశారు.

### బాధితురాలి ఫిర్యాదులో ఏముందంటే..

“2017లో జానీ మాస్టర్ పరిచయమయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్తో పాటు నేను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హోటల్లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పనిచేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో అనేకమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. షూటింగ్ సమయంలోనూ వ్యానిటీ వ్యాన్లో అసభ్యంగా ప్రవర్తించేవాడు. లైంగిక వాంఛ తీర్చనందుకు ఒకసారి జుట్టు పట్టుకుని తలను అద్దానికి కొట్టాడు. మతం మారి.. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పనిచేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రాకుండా ఇబ్బందిపెట్టాడు. ఆగస్టు 28న మా ఇంటి గుమ్మానికి గుర్తుతెలియని వ్యక్తులు ఓ పార్సిల్ వేలాడదీశారు. ‘మగబిడ్డకు అభినందనలు. కానీ జాగ్రత్తగా ఉండు’ అని అందులో రాసి ఉంది” అని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

## కూల్చివేత వ్యర్థాలు తొలగించేందుకు హైడ్రా టెండర్లు

**కూల్చివేత వ్యర్థాలు తొలగించేందుకు హైడ్రా టెండర్లు పిలిచింది. గురువారం నుంచి ఈ నెల 27 వరకు బిడ్లు స్వీకరించనున్నారు.**

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: కూల్చివేత వ్యర్థాలు తొలగించేందుకు హైడ్రా టెండర్లు పిలిచింది. గురువారం నుంచి ఈ నెల 27 వరకు బిడ్లు స్వీకరించనున్నారు. ఈమేరకు హైడ్రా అధికారులు ఆన్లైన్లో టెండర్లు ఆహ్వానించారు. ఇప్పటి వరకు 23 చోట్ల 262 నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. హైదరాబాద్లోని పలుచోట్ల చెరువుల బఫర్ జోన్లు, ఎన్టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై అధికారులు దృష్టి సారించిన విషయం తెలిసిందే.



## విడదల రజినీపై ఫిర్యాదు.. విచారణకు ఆదేశించిన హోం మంత్రి

**మాజీ మంత్రి విడదల రజినీపై పల్నాడు జిల్లా యడ్లపాడు బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యం హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేసింది.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: మాజీ మంత్రి విడదల రజినీపై పల్నాడు జిల్లా యడ్లపాడు బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యం హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేసింది. తమ నుంచి రజనీ, ఆమె పీఏ గోపి రూ.2.50 కోట్లు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై సానుకూలంగా స్పందించిన హోం మంత్రి.. విచారణకు ఆదేశించారు. మాజీ మంత్రి రజిని అక్రమాలు ఇటీవల ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. జగనన్న కాలనీ పేరిట తమవద్ద భూములు సేకరించి కమీషన్ వసూలు చేశారని, అవి ఇప్పించాలని జూన్లో చిలకలూరిపేట మండల రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు మొరపెట్టుకున్నారు. చిలకలూరిపేట మండలం పసుమర్రుకు, గుడిపూడి గ్రామాల రైతుల నుంచి 200 ఎకరాలను మాజీమంత్రి రజిని అనుచరులు సేకరించారు. 32 మంది నుంచి తొలుత 50 ఎకరాలు సేకరించారు. ఈ వ్యవహారంలో తమకు రజిని నుంచి రూ.1.16 కోట్లు రావాల్సి ఉందని రైతులంతా పోలీసులు, ఎంపీకి విన్నవించుకోగా ఆ మొత్తాన్ని ఇప్పించారు.

## ధర్మవరం వైద్యుడికి బెదిరింపులు.. రూ.33 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు!

**సైబర్ నేరగాళ్లకు సంబంధించిన వివరాలను ధర్మవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు.**



ధర్మవరం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: ముంబయి పోలీసులం అంటూ సైబర్ నేరగాళ్లు ఓ వైద్యుడికి వీడియో కాల్ చేసి బెదిరించి రూ.33 లక్షలను తమ ఖాతాలో వేయించుకున్నారు. దీంతో బాధితుడు ధర్మవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐదుగురు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ధర్మవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన వైద్యుడు సూర్యనారాయణరెడ్డికి ఇటీవల ముంబయి పోలీసు యూనిఫామ్ ధరించిన ఓ వ్యక్తి వాట్సప్ వీడియో కాల్ చేశాడు. ముంబయిలో నరేష్ గోయల్ అనే వ్యక్తి కెనరా బ్యాంకులో రూ.500 కోట్లు అప్పుగా తీసుకున్నారని, అందులో కొంత మొత్తం మీ ఖాతాలో జమచేశారు. అందుకు ఆ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు కమీషన్ తీసుకున్నారని వైద్యుడిని బెదిరించారు. రూ.33 లక్షలు ఇవ్వాలని లేకపోతే అక్కడికి వచ్చి అరెస్టు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయభ్రాంతుడైన వైద్యుడు రూ.20 లక్షలు, రూ.13 లక్షలను రెండు విడతలుగా సైబర్ నేరగాళ్లు ఇచ్చిన ఖాతాలో జమ చేశాడు. అనంతరం నరేష్ గోయల్ అనే వ్యక్తి నుంచి తన ఖాతాలో అసలు నగదు జమ అయ్యిందా అనే విషయంపై ఆరా తీశాడు. మోసపోయానని తెలుసుకున్న వైద్యుడు ధర్మవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇళయజర్, నంద్యాల జిల్లా అయ్యలూరు మెట్టు గ్రామానికి చెందిన ప్రహ్లాద, నంద్యాలకు చెందిన అంబిరెడ్డి, ఆళ్లగడ్డకు చెందిన సత్యం, బాపట్ల జిల్లా గూడవల్లికి చెందిన జావిద్ను అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. వైద్యుడి నుంచి సైబర్ నేరగాళ్ల ఖాతాలో జమ చేసిన డబ్బును త్వరలో రికవరీ చేస్తామని ఎస్పీ చెప్పారు.

## జగన్.. ఫిష్ ఆంధ్రను ఫినిష్ చేశారు: కొల్లు రవీంద్ర

**కృష్ణా జిల్లా పామర్రు మండలం కురుమద్దలిలో ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు.**

పామర్రు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: కృష్ణా జిల్లా పామర్రు మండలం కురుమద్దలిలో ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీని ఆక్వా హబ్ మారుద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లామన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీడ్, ఫీడ్ విషయంలోనూ జగన్ వేధింపులకు గురి చేశారని మండిపడ్డారు. జే ట్యాక్స్ బాదుడుతో ఆక్వా రంగం సంక్షోభంలో పడిందని, ఫిష్ ఆంధ్ర పేరుతో మత్స్య రంగాన్ని జగన్ ఫినిష్ చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## డిప్యూటీ సీఎం పవన్ మాజీ మంత్రి బాలినేని భేటీ

**వైకాపాకు రాజీనామా చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్తో భేటీ అయ్యారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: వైకాపాకు రాజీనామా చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. నిన్న వైకాపాకు రాజీనామా చేసిన అనంతరం బాలినేని.. నాగబాబుతో చర్చలు జరిపినట్లు సమాచారం. కొద్దిసేపటి క్రితం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయానికి చేరుకున్న బాలినేని పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. త్వరలోనే ఆయన జనసేన గూటికి చేరే అవకాశముంది.

## జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకు కమిటీ: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఐదేళ్ల పాటు ఏదో ఒకచోట పోలింగ్ జరుగుతున్నందున ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం, తద్వారా విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేక ప్రభుత్వ నిర్ణయాలకు ఆటంకంగా మారాయన్నారు. కొన్నిసార్లు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు చెప్పారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అసెంబ్లీలు, పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలకు ఫుల్స్టాప్ పెట్టి.. జమిలి ఎన్నికలు జరపాలని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామం అన్నారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభల కారణంగా.. ట్రాఫిక్ జామ్, ధ్వనికాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ కారణంగా ఖజానాపై ఆర్థికంగా భారం పడుతోందని చెప్పారు. పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడంతో జరుగుతున్న ఖర్చు రూ.4,500 కోట్ల పైమాటేనన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్రమంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై.. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. ప్రస్తుతం వ్యతిరేకిస్తున్న పార్టీలు త్వరలోనే దీనికి సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వంద రోజుల పాలనలో మధ్యతరగతి ప్రజలపై ప్రత్యేక దృష్టి: పురందేశ్వరి

**కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు కేంద్రం పెట్టుబడి సాయం చేస్తోందని భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు.**



రాజమహేంద్రవరం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 19: కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు కేంద్రం పెట్టుబడి సాయం చేస్తోందని భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం మూడు విడతలుగా రూ.6 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఠంచనుగా అన్నదాతల ఖాతాల్లో రూ.6 వేలు జమ చేస్తున్నామన్నారు. గడిచిన ఐదేళ్లలో రైతులకు రూ.3 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. 12 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు పెట్టుబడుల బాధలు తీరాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలపై దృష్టి సారించి పెంచిందని చెప్పారు. సహకార రంగం పునరుజ్జీవానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. భాజపా వంద రోజుల పాలనలో మధ్యతరగతి ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మౌలిక సదుపాయాల కోసం రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. 8 కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టులను మంజూరు చేసినట్లు పురందేశ్వరి చెప్పారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- తెలుగు మాధ్యమాల దినోత్సవం
- 1887: తెలుగు రచయిత, తెలుగు భాషా పండితుడు, హేతువాది, నాస్తికుడు తాపీ ధర్మారావు జననం (మ. 1973).
- 1911: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ పురస్కారం పొందిన బోయి భీమన్న జననం (మ. 2005).
- 1924: సుప్రసిద్ధ నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది కాటం లక్ష్మీనారాయణ జననం (మ. 2010).
- 1965: యునైటెడ్ స్టేట్స్ నావికాదళ అధికారిణి, నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ జననం. (చిత్రంలో)
- 2014: మాండలిన్ విద్వాంసుడు ఉప్పలపు శ్రీనివాస్ మరణం (జ. 1969).


తాపీ ధర్మారావు


బోయి భీమన్న


సునీతా విలియమ్స్


ఉప్పలపు శ్రీనివాస్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# ఆదుకొన్న యశస్వి జైస్వాల్.. భారత్ స్కోరు 176/6

**బంగ్లాదేశ్తో తొలి టెస్టులో యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ సాధించాడు. అయినా, ఆరు వికెట్లను కోల్పోయిన టీమ్ ఇండియా ఇబ్బందుల్లో పడేలా ఉంది.**

భారత్ కష్టాల్లో పడేలా ఉంది. బంగ్లాదేశ్తో జరుగుతున్న తొలి టెస్టులో మొదటి రోజు రెండో సెషన్లోపే కీలకమైన ఆరు వికెట్లను కోల్పోయింది. టీ బ్రేక్ సమయానికి టీమిండియా ఆరు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. క్రీజ్లో రవీంద్ర జడేజా (7), రవిచంద్రన్ అశ్విన్ (21) ఉన్నారు. భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (56) హాఫ్ సెంచరీ సాధించాడు. ఓ వైపు టాప్ బ్యాటర్లు పెవిలియన్కు చేరినా.. ఏమాత్రం తడబాటుకు గురి కాలేదు. ఏకాగ్రతతో పరుగులు రాబట్టాడు. డబ్ల్యూటీసీ 2023-25 సీజన్లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం యశస్వి 1,084 పరుగులతో ఉన్నాడు.



## స్వల్ప వ్యవధిలో వికెట్లు

తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్ ఆరంభంలోనే వికెట్లను కోల్పోయిన భారత్ను పంత్ (39) తో కలిసి యశస్వి ఆదుకున్నాడు. నాలుగో వికెట్కు 62 పరుగులు జోడించాడు. అయితే, హసన్ బౌలింగ్లో పంత్ ఔట్ కావడంతో కేఎల్ రాహుల్ (16) బ్యాటింగ్కు వచ్చాడు. ఐదోవికెట్కు యశస్వి-కేఎల్ 48 పరుగులు రాబట్టారు. అంతా సవ్యంగా సాగుతుందనగా బంగ్లా బౌలర్లు మరోసారి విజృంభించారు. స్వల్ప వ్యవధిలో వారిద్దరిని ఔట్ చేశారు. తొలుత నహిద్ రానా బౌలింగ్లో యశస్వి స్లిప్లో ఇస్లామ్కు క్యాచ్ ఇచ్చాడు. ఆ కాసేపటికే బంగ్లా స్పిన్నర్ మెహిదీ హసన్ వేసిన బంతిని డిఫెన్స్ చేయబోయిన కేఎల్ షార్ట్ లెగ్లో లోని జకీర్ పట్టిన అద్భుత క్యాచ్కు దొరికిపోయాడు. అంతకుముందు రోహిత్ శర్మ (6), విరాట్ కోహ్లి (6), శుభ్మన్ గిల్ (0) విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో హసన్ 4, మెహిదీ, నహిద్ ఒక్కో వికెట్ తీశారు.

## గిల్ అన్లక్కీ: పార్థివ్ పటేల్

ఎనిమిది బంతులను ఎదుర్కొన్నప్పటికీ పరుగుల ఖాతా తెరవడంలో మాత్రం గిల్ విఫలం కావడం నెట్టింట తీవ్ర దుమారం రేపింది. అతడిని విమర్శిస్తూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. అయితే గిల్ ఔట్ కావడం దురదృష్టమని భారత మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వ్యాఖ్యానించాడు. అలాగే కేఎల్ కంటే పంత్ను ముందు పంపడానికిగల కారణాలను విశ్లేషించాడు. "గిల్కు కలిసిరాలేదు. లెగ్సైడ్ బంతిని బౌండరీగా మలుద్దామని భావించాడు. కానీ, దురదృష్టవశాత్తూ క్యాచ్గా మారింది. క్రీజ్లో నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో ఆడాడు. వికెట్లకు దూరంగా లెగ్సైడ్ వెళ్లే బంతిని ఆడాలని ప్రతి బ్యాటర్ అనుకోవడం సహజమే. ఒక్కోసారి ఎడ్జ్ తీసుకొని వికెట్ను కోల్పోవాల్సి వస్తుంది. ఇక కోహ్లి ఔటైన తర్వాత అనూహ్యంగా పంత్ను దింపడం ఆశ్చర్యం కలిగించింది. అప్పటికే యశస్వి క్రీజ్లో ఉన్నాడు. అయినా మరో లెఫ్ట్ హ్యాండర్ను పంపించింది. అంతా కేఎల్ వస్తాడని ఊహించారు" అని వ్యాఖ్యానించాడు.

# "దేవర" నుంచి డైనమిక్ లుక్‌లో తారక్..



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం "దేవర" కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్టీఆర్ అభిమానులు సహా మాస్ ఆడియెన్స్ ఏ రేంజ్ లో ఎదురు చూస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ సాలిడ్ ప్రమోషన్స్ ని పాన్ ఇండియా భాషల్లో జరుపుకుంటుంది. అయితే మేకర్స్ తారక్ పై పలు కొత్త కొత్త పోస్టర్స్ స్టిల్స్ కూడా రిలీజ్ చేస్తున్నారు. ఇలా లేటెస్ట్ గా వచ్చిన కొన్ని పిక్స్ ఫ్యాన్స్ నడుమ వైరల్ గా మారాయి. "దేవర" లుక్స్ లో కనిపిస్తున్న తారక్ అయితే వీటిలో మంచి డైనమిక్ గా అలాగే పవర్ఫుల్ గా కనిపిస్తున్నాడని చెప్పాలి. దీనితో సినిమాలో మాత్రం తారక్ ఫ్యాన్స్ కి మంచి ఫీస్ట్ ని ఇవ్వనున్నాడని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ వారు నిర్మాణం వహించారు. అలాగే ఈ భారీ చిత్రం ఈ సెప్టెంబర్ 27న పాన్ ఇండియా భాషల్లో గ్రాండ్ గా రిలీజ్ కాబోతుంది.

# "విశ్వంభర" విజృంభణ తథ్యం.. అంచనాలు పెంచేస్తున్న దర్శకుడు

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ విజువల్ ట్రీట్ చిత్రం "విశ్వంభర" కోసం అందరికీ తెలిసిందే. మరి ఎంతో కాలం తర్వాత చిరు నుంచి సరైన సినిమాగా వస్తుండడంతో దీనిపై భారీ హైప్ నెలకొంది. అయితే ఈ సినిమా పనులు అన్నీ శరవేగంగా పూర్తి అవుతుండగా లేటెస్ట్ గా వశిష్ట పెట్టిన పోస్ట్ ఒకటి ఇప్పుడు అభిమానుల్లో అంచనాలు మరింత పెంచేసింది. విశ్వంభర రిలీజ్ డేట్ జనవరి 10, 2025ని పెట్టి విశ్వంభర విజృంభణ, ఆగమనం అంటూ పోస్ట్ చేసాడు. దీనితో మెగా ఫ్యాన్స్ అయితే వశిష్ట కాన్ఫిడెన్స్ చూసి ఆనందం వ్యక్తం చేస్తూ విశ్వంభరుడి ఆగమనం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ భారీ ప్రాజెక్ట్ కి కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.





రిపబ్లిక్ సినిమా CINEMA

# "సరిపోదా శనివారం" ఫ్యామిలీతో ప్రియాంక



రీసెంట్ గా మన టాలీవుడ్ దగ్గర రిలీజ్ కి వచ్చి సూపర్ హిట్ అయ్యిన చిత్రాల్లో నాచురల్ స్టార్ నాని హీరోగా దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్ లో చేసిన సాలిడ్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం "సరిపోదా శనివారం" కూడా ఒకటి. మరి నాని కెరీర్ లో మరో 100 కోట్ల సినిమాగా ఇది నిలిచి అదరగొట్టింది. మరి ఈ సినిమాపై లేటెస్ట్ గా చారూ.. అదే ఈ సినిమాలో హీరోయిన్ గా చేసిన ప్రియాంక మోహన్ సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. నాని, వివేక్ ఆత్రేయ, విలన్ ఎస్ జే సూర్య సహా సినిమాలో కనిపించిన చిన్నారి నటులుతో కలిసి ప్రియాంక పలు ఫోటోలు షేర్ చేసి తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. దీనితో నాని, ప్రియాంక ఫ్యాన్స్ ఈ స్పెషల్ మూమెంట్స్ చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందించగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహించారు.

# సూర్య "కంగువా" కొత్త రిలీజ్ డేట్ వచ్చేసింది..



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ గా చేసిన లేటెస్ట్ చిత్రమే "కంగువా". దర్శకుడు శివతో చేసిన ఈ సెన్సేషనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా రిలీజ్ ని వాయిదా వేస్తున్నట్టుగా కొన్ని రోజులు కితమే మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. అయితే దీని తర్వాత కొత్త రిలీజ్ డేట్ అనేది సస్పెన్స్ గా మారగా నవంబర్ రిలీజ్ అన్నట్టుగా పలు రూమర్స్ వచ్చాయి. అయితే ఈ సస్పెన్స్ పై ఫైనల్ గా మేకర్స్ సాలిడ్ క్లారిటీ ఇచ్చేసారు. మరి వచ్చిన రూమర్స్ ప్రకారం డేట్ నే అఫీషియల్ గా మేకర్స్ ప్రకటించేసారు. దీనితో ఈ చిత్రం పాన్ ఇండియా వైడ్ గా నవంబర్ 14న రిలీస్ కి తీసుకొంటున్నట్టుగా ప్రకటించేసారు. దీనితో అభిమానులు ఎదురు చూస్తున్న సస్పెన్స్ కి తెర లేచిపోయింది అని చెప్పాలి. ఇక ఈ భారీ చిత్రంలో దిశా పటాని హీరోయిన్ గా నటించగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. అలాగే స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహించారు.

# హోమ్ డెకరేషన్

# టైల్స్, పైపులపై పడ్డ నీటి మరకలు పోవాలంటే ఇలా చేయండి

**ఇంటిని క్లీన్ చేసినప్పుడు కొన్నిసార్లు కిటికి అద్దాలు, బాత్‌రూమ్ పైప్‌లు, షవర్ల మీద నీటి మరకలు కనిపిస్తాయి. వీటిని క్లీన్ చేయడానికి ఏం చేయాలో తెలుసుకోండి. మన కిచెన్‌లోని వాష్ బేసిన్, బాత్-రూమ్‌లో పైపులు అయినా నీటి మరకలు, మురికి కనిపిస్తుంది. ఈ పేరుకుపోయిన మురికిని తగ్గించి నీట్‌గా కనిపించేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. వీటి కారణంగా క్లీన్ చేసిన వస్తువులు, టైల్స్ మురికి పోయి తళతళలాడతాయి. మరి ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.**



## నిమ్మరసం..

కిచెన్‌లో మరకలు దూరం చేయడానికి నిమ్మరసాన్ని వాడొచ్చు. దీనికోసం బేకింగ్ సోడాలో నిమ్మరసం, కొద్దిగా నీరు కలిపి పేస్టులా చేయండి. అలా కాకుండా ఇంకొన్ని నీరు పోసి వీటిని స్ప్రే బాటిల్‌లో ఉంచండి. మరకలు ఉన్న చోట స్ప్రే చేసి 15 నిమిషాల తర్వాత రుద్ది క్లీన్ చేయండి.






## బేకింగ్ సోడా..

నీటి మరకల్ని దూరం చేయడానికి బేకింగ్ చాలా బాగా వర్క్ అవుతుంది. ఇందుకోసం బేకింగ్ సోడాలో కొద్దిగా నీరు పోయండి. దీనిని పేస్టులా చేయండి. తర్వాత తడిసిన ప్రదేశంలో దీనిని అప్లై చేయండి. అలానే 10 నుంచి 15 నిమిషాల పాటు ఉంచండి. తర్వాత శుభ్రమైన గుడ్డతో రుద్ది తర్వాత నీటితో క్లీన్ చేయండి. వారానికోసారి ఇలా చేస్తే పైపులు, కిటికీలు క్లీన్‌గా ఉంటాయి.

## లోషన్స్..

ప్రజెంట్ బాత్‌రూమ్ క్లీనింగ్ కోసం ఎన్నో లోషన్స్ ఉన్నాయి. వీటిని మీరు వాడొచ్చు. లేదంటే నార్మల్ ఫ్లోర్ క్లీనర్స్‌ని కూడా వాడొచ్చు. ముందుగా నీటిని స్ప్రే చేయండి. తర్వాత ఈ క్లీనర్‌ని కొద్దిగా నీటిలో కలిపి స్ప్రే బాటిల్‌లో వేయండి. తర్వాత స్ప్రే చేయండి. స్క్రబ్బర్‌తో స్క్రబ్ చేయండి. తర్వాత నీటితో క్లీన్ చేయండి.

## టూత్‌పేస్టు..

ఈ మరకలు క్లీన్ చేయడానికి టూత్‌పేస్టు కూడా వాడొచ్చు. ముఖ్యంగా వాష్‌బేసిన్స్‌ని టూత్‌పేస్టుతో క్లీన్ చేస్తే మెరుస్తాయి. ముందుగా వాటిపై నీటిని చల్లండి. ఎక్కడైతే మరకలు ఉన్నాయో అక్కడ టూత్‌పేస్టు వేసి బ్రష్‌తో రుద్దండి. దీని కోసం వైట్ టూత్‌పేస్ట్ వాడడం మంచిది. తర్వాత నీటితో క్లీన్ చేయండి.

## వెనిగర్, సబ్బు..

వెనిగర్, సబ్బు రెండింటిని కలిపి వాడడం వల్ల టైల్స్, పైప్‌ల మీద నీటి మరకలు ఈజీగా క్లీన్ చేసుకోవచ్చు. దీనికోసం ముందుగా ఓ గిన్నెలో సరిపడా నీటిని తీసుకోవాలి. అందులో రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ కలపండి. దీంతో పాటు కొద్దిగా డిటర్జెంట్ పౌడర్‌ని కలపండి. కొద్దిగా ఉప్పు వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో వేయండి. ఈ నీటిని మీరు మరకలు ఎక్కడైతే ఉన్నాయో అక్కడ స్ప్రే చేసి స్క్రబ్బర్‌తో క్లీన్ చేయండి. ఇలా చేస్తే పైపులు, వాష్ బేసిన్, కిటికీ గ్లాసులపై కూడా మరకలు ఈజీగా క్లీన్ అవుతాయి.

## మరికొన్ని టిప్స్..

మనం తలస్నానం చేసేటప్పుడు, గిన్నెలు కడిగినప్పుడల్లా టైల్స్‌పై పడ్డ మరకలపై నీరు వేసి తర్వాత గుడ్డతో తుడవడం వల్ల పాత్రలు, పైపులపై ఉన్న మరకలన్నీ తొలగిపోతాయి. తర్వాత గిన్నెలు కడిగిన తర్వాత పొడి గుడ్డతో తుడవాలి. దీంతో మరకలు తగ్గుతాయి. కిచెన్‌లో సింక్‌ని రాత్రుళ్ళు పడుకునే ముందు కడిగి శుభ్రమైన గుడ్డతో తుడవండి. దీని వల్ల నీటి మరకలు ఉండవు. చూడ్డానికి కొత్తగా ఉంటాయి.

